సాక్షి
జగిత్యాల
బుధవారం ✶ 27 ✶ డిసెంబర్ ✶ 2023



హన్మాన్ ఆలయంలో విప్ పూజలు

ధర్మపురి: తిమ్మాపూర్ శివారు పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ధర్మపురి ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజలు నిర్వహించారు.



నాలుగేళ్లుగా పొడిగింపులే..

నాలుగేళ్లుగా విద్యా కమిటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాఠశాల పరిపాలన గాడితప్పుతోందని విద్యా వంతులు వాపోతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
24.0/12.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం పొగమంచు భారీగా కురుస్తుంది. రాత్రి, సాయంత్రం వేళ చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ప్రజాపాలన సభలు వినియోగించుకోవాలి



సిరికొండలో ఆదిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కథలాపూర్(వేములవాడ): ఈనెల 28నుంచి నిర్వహించే ప్రజాపాలన సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సిరికొండ, తక్కళ్లపెల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం కృతజ్ఞత సభ ర్యాలీ నిర్వహించారు. ప్రజాపాలన సభల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న సిరికొండ- తక్కళ్లపెల్లి బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. సిరికొండకు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయిస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఎండీ.హఫీజ్, ముంజ జలంధర్, దూలూర్ శ్రీధర్, మ్యాదరవేని రాజు, ఎండీ ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

30న దొంతాపూర్ ఆస్పత్రికి ఎన్‌క్యూఏఎస్ బృందం



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాస్

ధర్మపురి: మండలంలోని దొంతాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని ఈనెల 30న ఎన్‌క్యూఏఎస్ బృందం పరిశీలించనుంది. ఈ మేరకు ఆస్పత్రిని మంగళవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఎన్‌క్యూఏఎస్ బృందం రానున్న నేపథ్యంలో అందుకనుగుణంగా ఆస్పత్రిలో ఉండాల్సిన వసతులు, ఏర్పాట్లను పరిశీలించామని తెలిపారు. ఆస్పత్రిలో చిన్నారులు, గర్భిణులకు సకాలంలో టీకాలు, వ్యాక్సిన్ ఎలా వేస్తున్నారో అధికారులు పరిశీలించనున్నారని, ప్రసవాల విధానం, టీబీ, క్షయ వంటి వాటిపై చేపట్టిన సర్వేలు, పౌష్టికాహారం పంపిణీ, మలేరియా, కీటకవ్యాధుల నివారణ తదితర అంశాలను కేంద్రబృందం పరిశీలించనుందని పేర్కొన్నారు. ఆయన వెంట సీహెచ్‌వో శ్రీధర్, ఎస్‌యువో శ్రీధర్ తదితరులున్నారు.

29న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

జగిత్యాలటౌన్: ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్డులోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక, కళాపోటీలు నిర్వహిస్తున్నట్లు యువజన, క్రీడల అధికారి కోరుకంటి రవికుమార్ తెలిపారు. జిల్లా యువజనోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో జిల్లా కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని నైపుణ్యాన్ని చాటాలని సూచించారు. జానపద నృత్యం సోలో, గ్రూపు, జానపదంలో సోలో, గ్రూపు, లైఫ్‌స్కిల్స్ విభాగంలో కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన, ఫొటోగ్రఫీ పోటీల్లోని ప్రతి అంశంలో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. 15 నుంచి 29 ఏళ్లవారు 97040 61725 నంబరులో సంప్రదించాలని కోరారు.

కల్లూర్ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం కల్లూర్ పంచాయతీలో డీటీసీపీ అనుమతి లేకుండా సుమారు 50 ఇళ్ల అనుమతి ఇచ్చిన విషయమై కార్యదర్శి ప్రశాంత్‌కు నోటీసులు ఇచ్చినట్లు ఎంపీవో నీరజ తెలిపారు. కల్లూర్ పంచాయతీ విజిట్‌కు వెళ్లిన సందర్భంలో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌ను పరిశీలించగా.. ఈ విషయం వెలుగులోకి వచ్చిందని ఆమె తెలిపారు. దీనిపై వివరణ ఇవ్వాలని కార్యదర్శికి నోటీసులు ఇచ్చామన్నారు. ప్రశాంత్ రెండు రోజులుగా కార్యాలయానికి రావడం లేదని తెలిసింది.

ఈ-కేవైసీ కోసం బారులు



ధర్మపురిలో క్యూ కట్టిన లబ్ధిదారులు

ధర్మపురి: రాష్ట్ర ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించడంతో ఈకేవైసీ కోసం ప్రజలు గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. ఉదయం ఆరు గంటలకే క్యూలు కడుతున్నారు. ధర్మపురిలోని ఓ గ్యాస్ ఏజెన్సీ ముందుకు ప్రజలు ఉదయం ఆరు గంటలకే వచ్చి ఇలా కూర్చోవడం కనిపించింది.

వీధి కుక్కలతో బెంబేలు

- ప్రజలపై దాడి చేస్తున్న శైనం
- గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- ఎనిమల్ బర్త్ కంట్రోల్ ఎక్కడ..?



కుక్కల గుంపు

జగిత్యాల: చీకటి పడితే చాలు కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. పెద్దగా మొరుగుతూ.. మీదికి మరీ దాడి చేస్తున్నాయి. జగిత్యాలలో గతంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) ఏర్పాటు చేస్తామని, వీధి కుక్కల బెడద లేకుండా సంతాననియంత్రణలో భాగంగా శస్త్ర చికిత్స చేసి గర్భసంచి తొలగిస్తామని పేర్కొన్నారు. అయితే అది ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. అంతర్గత రహదారులు, కాలనీల్లో గుంపులుగా సంచరిస్తూ దాడిచేయడంతో జిల్లా ఆస్పత్రికి నిత్యం 10 నుంచి 20 మంది వరకు వస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్, టవర్‌సర్కిల్, సార్గమ్మసంధి, విద్యానగర్ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. యువకులు విద్యార్థినులు, మహిళలు సాయంత్రం పూట బయటకు వెళ్లాలంటే తోడుగా ఇంకొందరిని తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నారులు గ్రౌండ్‌లో, ఇతరత్రా ప్రాంతాల్లో ఆడుకోవాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. దీని గురించి మున్సిపల్ అధికారులు కనీసం స్పందించడం లేదు.

'జిల్లా కేంద్రంలోని 40వ వార్డు పురాణిపేటలో సోమవారం రాత్రి ముగ్గురు యువకులు నడుచుకుంటూ వెళ్తున్నారు. అక్కడున్న కుక్కల గుంపు వారిపై దాడిచేయగా.. అందరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి సంఘటనలు కేవలం ఒక్కరోజే కాదు.. ప్రతిరోజూ జరుగుతున్న తతంగం.

ఎనిమల్ బర్త్ కంట్రోల్ ఎక్కడ..?

కుక్కల సంతానం విచ్చలవిడిగా పెరగకుండా ఎనిమల్ బర్త్ కంట్రోల్ దిశగా అధికారులు కార్యాచరణ రూపొందించినా అమలుకు నోచుకోవడం లేదు. కుక్కల సంతానం పెరగడకుండా ఉండేందుకు శస్త్ర చికిత్సలతోనే సాధ్యమని అధికారులు భావించినప్పటికీ ఈ పద్ధతి అత్యధిక ఖర్చుతో కూడుకున్నది కావడంతో ఇటు మున్సిపల్, అటు గ్రామపంచాయతీ నిర్వాహకులు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒక కుక్కకు శస్త్ర చికిత్స చేయాలంటే రూ.1500 నుంచి రూ.2000 వరకు ఖర్చవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో మున్సిపాలిటీలో 5 నుంచి 8 వేల వరకు కుక్కలుంటాయి. జిల్లా మొత్తం లెక్కేస్తే చాలా వరకు ఉంటాయని చెబుతున్నారు. ఒకవేళ అధికారులు రిస్క్ చేసి శస్త్ర చికిత్స చేసినా వాటిని 5 రోజుల పాటు ఆస్పత్రుల్లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచాల్సి ఉంటుంది. ఇది సాధ్యం కాదని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మున్సిపల్ అధికారులకు కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసే స్వచ్ఛంద సంస్థలు వరంగల్, హైదరాబాద్ సమీపంలో ఉన్నాయని, వీరికి టెండర్ ఇస్తే వారి పర్యవేక్షణలో శస్త్ర చికిత్స చేసి వారి వద్దే మూడు రోజులు ఉంచుకుని మళ్లీ యథావిధిగా ఏ ఏరియా అయితే అక్కడ వదిలి పెడుతుంటారని మరికొందరు అంటున్నారు.

మత్తు ఇంజక్షన్ల పేరిట ఖర్చు

కుక్కలను చంపవద్దన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మున్సిపాలిటీలో శునకాలకు మత్తు మందు ఇంజక్షన్లు వేసేందుకు ఆంధ్రాప్రాంతంలోని పిఠాపురం నుంచి ప్రత్యేక బృందాలను రప్పిస్తున్నారు. ఇంజక్షన్ వేసిన అనంతరం కుక్కలను ఊరిబయట వదిలేస్తున్నారు. కానీ.. మత్తు దిగాక అవి తిరిగి గ్రామాలకే చేరుతున్నాయి. ఇలా మున్సిపాలిటీలకు రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు వస్తుందని చెబుతున్నారు. మున్సిపాలిటీల్లో కుక్కలను పట్టుకునే పేరిట అత్యధిక బిల్లులు పెడుతున్నట్లు సైతం ఆరోపణలున్నాయి.

ఎనిమల్ కేర్ సెంటర్ కరువు

ప్రతి మున్సిపాలిటీలో కుక్కలను తరలించి వాటికి సపరేట్‌గా ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అవి జిల్లాలో ఎక్కడా కన్పించడం లేదు. జిల్లాలోని టీఆర్‌నగర్‌లో ఎనిమల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. భవనం పూర్తయినప్పటికీ అక్కడ నిర్వహణ జరగడం లేదు.

ప్రతిరోజూ నమోదవుతున్న కేసులు

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిత్యం కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. అయితే వ్యాక్సిన్ కొరత లేకున్నా.. కేసులు ఇలాగే వస్తే మాత్రం సరిపోవని వైద్యులు పేర్కొంటున్నారు. కుక్కకాటుతో తీవ్రమైన గాయాలైనప్పుడు తప్పకుండా ఇమినోగ్లోబిన్ వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇవి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో మాత్రమే సరఫరా అవుతుంది.



కుక్కల దాడిలో గాయపడిన ఓ యువకుడు

చర్యలు తీసుకుంటున్నం



కుక్కలు అధికంగా ఉన్నాయి. వాటిని అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఇటీవల టెండర్లు కూడా నిర్వహించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఎనిమల్త్ బర్త్ కంట్రోల్ భవనం సైతం పూర్తయింది. జిల్లా కేంద్రంలో ఎలాంటి సమస్యలూ లేకుండా చూస్తాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

ప్రజాపాలనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రత్యేకాధికారుల నియామకం
- కలెక్టర్ యాస్మిన్ బాషా



కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, కోరుట్ల నియోజకవర్గానికి కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, జగిత్యాలకు ఆర్డీవో నర్సింహమూర్తి, ధర్మపురికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, చొప్పదండికి డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రావు, వేములవాడకు మెట్‌పల్లి ఆర్డీవో మధును నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని 18 మండలాలకు ఆయా తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులతోపాటు, ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. బీర్‌పూర్ మండలానికి ప్రకాశ్, ధర్మపురికి అబ్దుల్‌రహమన్, గొల్లపల్లికి రఘువరన్, జగిత్యాల రూరల్‌కు అబ్జల్ హుస్సేన్‌ఖాన్, జగిత్యాల అర్బన్‌కు రాజ్‌కుమార్, కథలాపూర్‌కు వెంకటేశ్వర్‌రావు, కొడిమ్యాలకు ప్రతాప్‌సింగ్, కోరుట్లకు ఎం.శ్రీనివాస్, మల్లాపూర్‌కు నరేశ్, మల్యాలకు సురేశ్, మేడిపల్లి, భీమారానికి ఎం.సత్యనారాయణ, మెట్‌పల్లికి భాస్కర్, పెగడపల్లికి వెంకటేశ్వర్‌రావు, రాయికల్‌కు జగన్మోహన్‌రెడ్డి, సారంగాపూర్‌కు మిలింద్, వెల్గటూర్, ఎండపల్లి మండలాలకు నారాయణను నియమించామని పేర్కొన్నారు. అలాగే జగిత్యాల మున్సిపాలిటీకి నరేశ్, కోరుట్లకు విజయ్‌కుమార్, మెట్‌పల్లికి ప్రేమ్‌కుమార్, రాయికల్‌కు దేవేందర్ రెడ్డి, ధర్మపురికి రోహిత్‌ను నియమించినట్లు వివరించారు.

ఒక్కరోజులోనే ఫ్యామిలీమెంబర్ సర్టిఫికెట్..!

- గుర్తించిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు
- పొరపాటున జారీ అయిందంటున్న తహసీల్దార్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- ఒకరిపై కేసు నమోదు చేసిన పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల తహసీల్దార్ కార్యాలయం నుంచి ఓ వ్యక్తికి ఒకేరోజు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ అయ్యింది. అయితే దానిని జారీ చేసిన తహసీల్దారే పొరపాటున జారీ అయ్యిందని గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన ఐజద్ అహ్మద్ తన కుటుంబంలోని ఒకరి నుంచి వచ్చిన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఐదు రోజుల క్రితం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. వారు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో సదరు వ్యక్తి హడావుడిగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని దరఖాస్తు చేసుకున్నాడు. దానిని కిందిస్థాయి అధికారులు ధ్రువీకరించి కంప్యూటర్ గదిలో పెట్టారు. తహసీల్దార్ కూడా ఎలాంటి విచారణ చేపట్టకుండానే అతడికి ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఆ సర్టిఫికెట్‌తో ఐజద్ అహ్మద్ అదేరోజు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు అందించాడు. అయితే ఆ సర్టిఫికెట్ ఒక్కరోజులో జారీ కాదని గుర్తించిన అక్కడి అధికారులు తిరస్కరించారు. వాస్తవానికి ఫ్యామిలీమెంబర్ సర్టిఫికెట్ కావాలంటే ముందుగా దరఖాస్తు చేసుకుంటే ఆర్‌ఐ విచారణ చేపట్టి కార్యాలయంపై సభ్యుల వివరాలు ప్రదర్శించాలి. అనంతరం కుటుంబం వద్దకు వెళ్లి విచారణ చేపట్టాలి. అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించాలి. ఈ తతంగా పూర్తికి సుమారు నాలుగు రోజులైనా పడుతుంది. కానీ ఒక్కరోజులోనే సర్టిఫికెట్ ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. అయితే పొరపాటు జరిగిందని గుర్తించిన తహసీల్దార్ అదేరోజు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐజద్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ వర్దన్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. రోజువారీలాగా వివిధ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నప్పుడు పొరపాటున ఫ్యామిలీమెంబర్ సర్టిఫికేట్ జారీ అయ్యిందని, దానిని తమ సిబ్బంది గ్రహించి తెలియజేయడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

కల్యాణమస్తుతోపాటు బంగారమూ ఇవ్వాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆడబిడ్డల పెళ్లికి కల్యాణమస్తుతోపాటు తులం బంగారం కూడా ఇవ్వాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్‌లోని వర్తక సంఘ భవనంలో 27మందికి కల్యాణలక్ష్మి కింద మంజూరైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద రూ.1,00,016 అందించామని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.లక్షతోపాటు, తులం బంగారం ఇవ్వాలని సూచించారు. లేకుంటే ప్రశ్నిస్తామన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్వేతపత్రం విడుదల చేసి పదేళ్లలో జరిగిన అభివృద్ధి.. 2014కు ముందున్న పరిస్థితులను కళ్లకు కట్టారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, ఏఎంసీ చైర్మన్ మారంపల్లి రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్, మండల అధ్యక్షుడు తలారి రాజేశ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అనుపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.




ఘనంగా దత్త జయంతి

ధర్మపురి/మెట్‌పల్లిరూరల్: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంగళవారం దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మెట్‌పల్లి మండలం వెల్లులలోని శ్రీగురుదత్త ఆశ్రమంలో దత్త జయంతిని ఘనంగా జరిగింది. అర్చకులు జోషి శ్రీనాథ్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రాములోరి అక్షింతలకు స్వాగతం



మల్లాపూర్: అక్షింతలతో తరలివస్తున్న భక్తులు

సారంగాపూర్/మల్లాపూర్: అయోధ్యలోని శ్రీరామ మందిరం నుంచి పంపించిన అక్షింతలకు సారంగాపూర్ మండలం రేచపల్లి, మల్లాపూర్ మండల కేంద్రానికి చేరుకున్నాయి. అక్షింతలకు ఆయా గ్రామాల్లో మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. రేచపల్లిలోని శ్రీజగన్నాథ స్వామి ఆలయం వద్ద శోభాయాత్ర నిర్వహించారు. మల్లాపూర్‌లో హనుమాన్ దేవాలయం నుంచి అల్లూరి సీతరామరాజు కూడలి, కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ మీదుగా శోభాయాత్ర చేపట్టారు.

రేచపల్లి పల్లె దవాఖానాలో మరిన్ని సేవలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీధర్



ఎన్‌క్యూఏఎస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్

సారంగాపూర్: రేచపల్లితోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువ చేయడానికి రేచపల్లి పల్లె దవాఖానాలో ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సిస్టమ్) కేంద్రం ఏర్పాటు చేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీధర్ అన్నారు. పల్లె దవాఖానాలో ఎన్‌క్యూఏఎస్ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ కింద ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో వైద్యుడు, ఏఎన్ఎం, ఆశాలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇందులో గర్భిణులకు ప్రతినెలా వైద్యపరీక్షలు, పిల్లలకు టీకాలు అందిస్తారని, మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించి మందులు అందించనున్నట్లు వెల్లడించారు. రేచపల్లి, మ్యాడారంతండా, భీంరెడ్డిగూడెం, లచ్చునాయక్‌తండా ప్రజలు వైద్యసేవలు పొందాలని సూచించారు. రెండురోజుల్లో రేచపల్లి కేంద్రాన్ని కేంద్ర బృందం సందర్శిస్తుందని వెల్లడించారు. ఆయన వెంట మాతాశిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

వేతనాలు రాక వెతలు

- వీఆర్‌ఏ వ్యవస్థను తొలగించిన బీఆర్‌ఎస్
- ఐదు నెలలుగా అందించని వేతనాలు
- కొత్త ప్రభుత్వం ఇప్పించాలని వేడుకోలు



వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించడంతో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

పెగడపల్లి: ఐదు నెలలుగా వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, కొత్త ప్రభుత్వం స్పందించి తమకు జీతాలు చెల్లించాలని గతంలో వీఆర్‌ఏలుగా పనిచేసిన వారు కోరుతున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏలను తొలగించి వారిని విద్యార్హత ప్రకారం వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. అయితే ఆయా జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది. జీవో 81, 85 ద్వారా ఇతర ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ హోదాలో విలీనం చేసింది. అయితే విలీనం తరువాత వారికి ఇవ్వాల్సిన గుర్తింపు సంఖ్య (ఐడీ) కేటాయించకపోవడంతో జీతాలు అందడం లేదు. ఆ తరువాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అటు రెవెన్యూ నుంచి ఇటు కొత్తశాఖ నుంచి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారు.

అర్హతల ప్రకారం బదిలీ

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 858మంది వీఆర్‌ఏలు విధులు నిర్వర్తించారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీరిని గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి విద్యార్హత ప్రకారం జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్లుగా ఖాళీలున్న శాఖల్లోకి బదిలీ చేసింది. ఆగస్టు నెలలో వీరికి ఉద్యోగ నియామక పత్రాలిచ్చి విధుల్లో చేరాలని ఆదేశించారు. ఇలా మొత్తం 658 మందికి విధులు కేటాయించింది. మరో 150 మందికి వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టింది. మిగతా వీఆర్‌ఏల వయసు ఎక్కువగా ఉండటంతో వారి వారసులకు ఉద్యోగ అవకాశం ఇవ్వాల్సి ఉంది.

ఉద్యోగ ఐడీ కేటాయించకపోవడంతో..

వీఆర్‌ఏలను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి నియామక పత్రాలు ఇచ్చినప్పటికీ ఉద్యోగ ఐడీ కేటాయించలేదు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు వారికి కేటాయించిన శాఖల్లోకి వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడ పైఅధికారులకు వేతనాలు ఇవ్వాలని అడిగితే ఐడీ రాలేదని సమాధానం చెబుతున్నారని వీఆర్‌ఏలు పేర్కొంటున్నారు.

కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలి



మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి విద్యార్హతలను బట్టి వివిధ శాఖలకు బదిలీ చేసి నాలుగు నెలలు గడిచించింది. గుర్తింపు సంఖ్య కేటాయించకపోవడంతో జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొత్త ప్రభుత్వం పట్టించుకుని వెంటనే వేతనాలివ్వాలని కోరుతున్నాం.

– ఎల్దాసరి ప్రవీణ్, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

శ్రామికవర్గాల కోసమే పోరాటం



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

జగిత్యాల: కమ్యూనిస్టు పార్టీ 99ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అనేక ఎత్తుపల్లాలు చూసిందని, శ్రామికవర్గ ప్రయోజనాల కోసం ఎక్కడా రాజీపడలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. దేశంలో సోషలిస్ట్ స్థాపన, రాజ్యాంగంలో సవరణలకు కమ్యూనిస్టుల పోరాటం మరవలేనిదన్నారు. పార్టీ నాయకులు కోరుకంటి శ్రీనివాస్, ఎండీ.ముక్రం, శాంత, దేవదాసు, వెన్న మహేశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండి సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

రామడుగు(చొప్పదండి): మండలంలోని గుండి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎ.వినయ్‌కుమార్ మద్యం సేవించి విధులకు హాజరైనందున విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24న వినయ్‌కుమార్ మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్నాడనే సమాచారం అందుకున్న అధికారులు బ్రీత్ అనలైజర్‌తో టెస్టు చేశారు. మద్యం సేవించినట్లు రికార్డు కావడంతో నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. విచారణ చేసిన డీఈఈ సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు.

సెల్ పాయింట్‌లో చోరీ


ఘటనాస్థలిలో పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అంగడి బజార్‌లో గల ఓ సెల్ పాయింట్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీరాజరాజేశ్వర సెల్ పాయింట్ తాళాలు పగులగొట్టి, షాపులో ఉన్న సుమారు రూ.10 వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చిన యజమాని చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనాస్థలికి చేరుకొని, వివరాలు సేకరించారు.

తాళం వేసిన ఇంట్లో..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య తన కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 21న తిరుపతి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకోగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి, ఇల్లంతా చిందరవందరగా ఉంది. వెంటనే కోనరావుపేట పోలీసులకు ఫోన్ చేయగా ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై రఘుపతిరెడ్డి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గంగాధర(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో రామడుగు మండలంలోని వెదిర గ్రామానికి చెందిన విలాసాగరపు నారాయణ(60) మృతి చెందినట్లు గంగాధర పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నారాయణకు కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. సోమవారం ఇంటి నుంచి వెళ్లపోయాడు. రాత్రివేళ గంగాధర మండలంలోని కొండన్నపల్లి వరద కాలువ సమీపంలో కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో పోలీసులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, నారాయణ మృతి విషయం అతని కుటుంబసభ్యులకు మంగళవారం సాయంత్రం తెలియడంతో ఆస్పత్రికి వెళ్లి, మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేసు నమోదు

వేములవాడఅర్బన్: దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాలు.. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో తిరుపతి అనే వ్యక్తి ఇంటి విద్యుత్ బిల్ రూ.9 వేలు బకాయి ఉన్నందున వేములవాడ టౌన్ సెస్ లైన్‌మెన్ రమణారెడ్డి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. ఈక్రమంలో తిరుపతి మళ్లీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండనే సమాచారంతో వెళ్లిన లైన్‌మెన్ రమణారెడ్డితో తిరుపతి దురుసుగా ప్రవర్తించాడు. చేతులతో నెట్టివేసినట్లు రమణారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

నాలుగేళ్లుగా పొడిగింపులే..

- ఎస్ఎంసీ కమిటీల ఎన్నికలు పట్టని ప్రభుత్వం
- 2019 నుంచి దాటవేతలే
- ఈ నెల 31తో ముగియనున్న కమిటీల గడువు


చింతకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

కరీంనగర్: నాలుగేళ్లుగా విద్యా కమిటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాఠశాల పరిపాలన గాడితప్పుతోందని విద్యావంతులు వాపోతున్నారు. 2019తో ముగిసిన విద్యాకమిటీల కాల పరిమితిని ప్రతి ఆరునెలలకోసారి ప్రభుత్వం పొడగిస్తుండడంతో ఎన్నికల నిర్వహణ గాలిలో దీపంగా మారింది. తాజాగా ఈనెల 31తో విద్యాకమిటీలకు కాల పరిమితి ముగియనుండడంతో ఈసారైనా ఎస్ఎంసీ కమిటీలకు ఎన్నికలు జరుగుతాయో లేదోననే మీమాంస నెలకొంది. ఇప్పుడైనా ఎన్నికలు నిర్వహిస్తారో, మళ్లీ గడువు పొడగిస్తారో వేచి చూడాల్సిందే.

జిల్లాలో 678 కమిటీలు

జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు 651 ఉన్నాయి. మిగితావి కేజీబీవీ, ఆదర్శ, యూఆర్ఎస్, టీఎస్ఆర్ఈ పాఠశాలల కమిటీలు కలుపుకుని మొత్తం 678 కమిటీలు ఉన్నాయి. వీటిలో 62 వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పిల్లల విద్యా ప్రమాణాలను సాధించేందుకు తల్లిదండ్రులు, విద్యాభిమానుల సహకారంతో ఎస్ఎంసీలను ఏర్పాటు చేశారు. 6–8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న అల్పాహారం, మధ్యాహ్న భోజన నిర్వహణతో పాటు ప్రభుత్వం నుంచి పిల్లలకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, దుస్తులు, పాఠశాలలకు వచ్చే నిధుల వివరాలు, మౌళిక వసతుల నిర్వహణపై ఎస్ఎంసీ కమిటీలను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతినెలా ఎస్ఎంసీ సమావేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రణాళికలు రూపొందించి వాటి అమలుకు కమిటీలు శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. కాగా, గత నాలుగేళ్లుగా పాత కమిటీలనే కొనసాగిస్తున్నారు. పలు పాఠశాలల్లో విద్యాకమిటీ సభ్యుల పిల్లలు పై చదువులకు వెళ్లిపోయారు. దీంతో ఆయా కమిటీల పర్యవేక్షణ పాఠశాలలపై లేకపోవడంతో ఎస్ఎంసీ కమిటీలు ఉన్నట్టా, లేనట్టా అనే సందిగ్ధం నెలకొంది. నాలుగేళ్లుగా వాయిదాలు పడుతుండగా ఇకనైనా ఎన్నికలు నిర్వహించి పాఠశాలల నిర్వహణ గాడిలో పడేలా చూడాలని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా..



ఎస్ఎంసీ చైర్మన్ల పదవీకాలం ఈనెలాఖరు వరకు పొడగిస్తూ ఉత్తర్వులు అందాయి. తిరిగి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేవరకు పాత కమిటీలే పనులను పర్యవేక్షిస్తాయి. కమిటీల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి అందే ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం.

– జనార్దన్‌రావు, డీఈవో

కారు ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు


కారు బానట్‌పై పడిన పోశయ్య, గాలిలో ఎగిరి తలకిందులుగా పడుతున్న మల్లవ్వ

చందుర్తి(వేములవాడ): కారు అతి వేగానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామానికి చెందిన మల్లారపు పోశయ్య– మల్లవ్వ దంపతులు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కట్టలింగంపేట బస్టాండ్ సమీపంలో రుద్రంగి నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోశయ్య ఎగిరి కారు బానట్‌పై పడగా, మల్లవ్వ గాలిలో లేచి తలకిందులుగా కిందపడింది. దంపతులిద్దరినీ కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మల్లవ్వ పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు. కారు అతివేగమే ప్రమాదనికి కారణమని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

యాసంగి సాగు ముమ్మరం


ఇరుకుల్లలో వరి నాటు వేస్తున్న మహిళా కూలీలు

- నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి తడులు
- కరీంనగర్ రూరల్ డివిజన్‌లో వరినాట్లు ప్రారంభం
- ప్రాజెక్టు ఆయకట్టు కింద 14,987 ఎకరాలు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు రైతులు వరి నారు పోస్తుండగా మరికొందరు పొలాలను దున్నుతున్నారు. అయితే, సాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్న ఉద్దేశంతో పలువురు అన్నదాతలు ముందస్తుగా నాట్లు వేయిస్తున్నారు. ఎస్సారెస్పీ నీటిపై ఆశతో ఉన్నవారు ఆరుతడి పంటలకు బదులు వరి సాగువైపే మొగ్గు చూపుతున్నారు.

వారబందీ విధానం అమలు

కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. వానాకాలంలో వరి పంట సాగు చేసిన రైతులు చెరువులు, బావుల్లో పుష్కలంగా నీరు ఉండటం, ఎస్సారెస్పీ నీటి విడుదల నేపథ్యంలో యాసంగిలో సైతం వరి సాగుకే ముందుకొస్తున్నారు. ఈ నెల 18న ఎస్సారెస్పీ నుంచి నీళ్లు విడుదల చేయగా కరీంనగర్ మండలానికి బుధవారం నుంచి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. వారబందీ విధానంలో 8 రోజులు నీటి సరఫరా, 7 రోజులు నిలిపివేత పద్ధతిలో నీరందించనున్నారు. ఈ నెలలో ఒక తడి, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండేసి తడుల చొప్పున మొత్తం 7 నీటి తడులను విడుదల చేయనున్నారు. మండలంలో 13,009 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా వరిని 12,185 ఎకరాల్లో పండిస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే, సాగునీటి సౌకర్యంతో ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముంది. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధి(కొత్తపల్లితో కలిపి)లోని డీ–89 నుంచి డీ–94 కాల్వల వరకు ఎస్సారెస్పీ ఆయకట్టు కింద మొత్తం 14,987 ఎకరాలు సాగవుతుంది. అత్యధికంగా నగునూరులో 2,950 ఎకరాలు, చామనపల్లిలో 1,789, బొమ్మకల్‌లో 1,289, మొగ్దుంపూర్‌లో 1,054, ఇరుకుల్లలో 1,086, చేగుర్తిలో 1,022, గోపాల్‌పూర్‌లో 993, ఎలబోతారంలో 935 ఎకరాల్లో పండించనున్నారు.

ఆయకట్టు చివరికీ నీరందిస్తాం

ఎస్సారెస్పీ నీళ్లు బుధవారం నుంచి అందుబాటులోకి వస్తాయి. ఆయకట్టు చివరి భూములకూ అందించేలా చర్యలు తీసుకుంటాం. కాల్వల్లో నాచు, తుంగ, చెత్తాచెదారాన్ని జేసీబీతో తొలగించాం.

– సంతోష్, డీఈ, నీటిపారుదలశాఖ

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

- రాత్రివేళల్లో పనులు నిలిపివేయాలని డిమాండ్


లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

మానకొండూర్: రాత్రింబవళ్లు మిషనరీలతో బండరాళ్లు పగలగొడుతూ, బ్లాస్టింగులు చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పెద్దూర్ పల్లెగ్రామస్తులు మంగళవారం టిప్పర్లను అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ టిప్పర్లను వెళ్లనిచ్చేది లేదని మండిపడ్డారు. చెంజర్ల రెవెన్యూ శివారులోని కొండెగల గుట్ట నుంచి గ్రానైట్ తీయగా, మిగిలిన వేస్టేజ్ రాయిని డీబీఎల్ కంపెనీ టిప్పర్ల ద్వారా నేషనల్ హైవే పనులకు నిత్యం తరలిస్తున్నారు. శబ్ద కాలుష్యంతో గ్రామస్తులకు నిద్ర లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగు కారణంగా పంట పొలాల్లో బండరాళ్లు పడటంతో నష్టపోతున్నామని, శబ్ద, వాయుకాలుష్యం ఏర్పడుతుందని, తారురోడ్డు పగుళ్లు బారి అధ్వాన్నంగా మారుతుందని ఆరోపించారు. నాలుగు నెలల క్రితమే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాత్రి వేళల్లో పనులు బంద్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్ రిమాండ్


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ కృష్ణకుమార్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం పోచెట్టిపల్లి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన నిందితుడు చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాజును మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ వై.కృష్ణకుమార్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం, డ్రైవింగ్‌లో నిర్ణీత వేగాన్ని పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ఇతర పత్రాలు కలిగి ఉండాలన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు చందుర్తి ఉపాధ్యాయుడి ఎంపిక


విద్యార్థులకు భౌతికశాస్త్రం పాఠ్యాంశాలు బోధిస్తున్న ఓదెలుకుమార్

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీపాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బాషబత్తిని ఓదెలుకుమార్ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కి ఎంపికయ్యాడు. మంగళవారం ఆయన చిగురుమామిడిలో మాట్లాడారు. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో జనవరి 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ తొమ్మిదవ ఇంటర్నేషనల్ సైన్స్‌ఫెస్టివల్ జరుగుతుందన్నారు. నాలుగోసారి జాతీయ స్థాయి సైన్స్‌ఫెస్టివల్‌కు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. సదస్సులో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, శాస్త్రవేత్తల సెమినార్లు, పరస్పర చర్చలు, ప్రదర్శనలు, పోటీలు, విజ్ఞాన శాస్త్ర భాగస్వామ్య కార్యక్రమాలు, సాంకేతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ద్రా చేయలే.. ఎవరికీ పంపలే

- బ్యాంకు ఖాతా నుంచి రూ.8,500 జీఐటీ ముంబయికి బదిలీ
- తిరిగి ఇప్పించాలని బాధితుడి వేడుకోలు


బాధితుడు రవి

జూలపల్లి(పెద్దపల్లి): ద్రా చేయలే.. ఎవరికీ పంపలే.. అయినా ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మరో అకౌంట్‌కు బదిలీ అయ్యాయి. బాధితుడి వివరాల ప్రకారం.. జూలపల్లి మండలంలోని కాచాపూర్‌కు చెందిన దీకొండ రవి గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతనికి పెద్దపల్లిలోని ఎస్‌బీఐ శాఖలో సేవింగ్స్ అకౌంట్ ఉంది. ఖాతాలో రూ.8,574.46 ఈ నెల 24 వరకు ఉన్నాయి. 25న కరీంనగర్ వెళ్లి, సామగ్రి తెచ్చుకుందామని అకౌంట్ చెక్ చేయగా రూ.74.46 చూపించాయి. మంగళవారం బ్యాంకుకు వెళ్లి, ప్రింట్ తీయించగా అతని ఖాతా నుంచి డీఏయూ రూరల్ బ్యాంకింగ్ జీఐటీ ముంబయికి రూ.8,500 బదిలీ అయ్యాయని వచ్చింది. దీంతో రవి వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. సంబంధిత కాపీ, బ్యాంకు ఖాతా పుస్తకంపై వచ్చిన ప్రింట్‌ను జూలపల్లి పోలీసులకు అందజేశాడు. అనంతరం మాట్లాడుతూ.. తాను ఎక్కడా వేలిముద్ర వేయలేదని, ఓటీపీ కూడా ఎవరూ అడగలేదని తెలిపాడు. అయినా, ఖాతా నుంచి డబ్బులు బదిలీ అయ్యాయని వాపోయాడు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం చేస్తారని ఎందరికో చెప్పే తనకే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇప్పించాలని పోలీసులను వేడుకున్నాడు.

పాన్‌షాపులో దొంగతనం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని ఓ పాన్‌షాపులో దొంగతనం జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీసేవ కేంద్రం ఎదుట బూర్ల శ్రావణ్ పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. అతను సోమవారం రాత్రి దుకాణం మూసి, ఇంటికి వెళ్లిపోయాడు. గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి, రూ.10 వేల విలువైన సామగ్రి చోరీ చేశారు. బాధితుడు మంగళవారం ఉదయం పాన్‌షాపు వద్దకు వచ్చి, దొంగతనం జరిగినట్లు నిర్ధారణకు వచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీవన్ తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతంలో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, అదే ప్రాంతంలోని మరో దుకాణం తాళాలు పగులగొట్టినట్లు సమాచారం

చికిత్స పొందుతూ యువతి మృతి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాకకు చెందిన దొండ సౌమ్య(19) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ విజేందర్ వివరాల ప్రకారం.. దొండ సరిత–నర్సయ్య దంపతులకు ముగ్గురు కూతుళ్లు. రెండో కూతురు సౌమ్య ఇంటర్ వరకు చదివి, ఇంటి వద్దే ఉంటూ రోజువారీ కూలీ పనులకు వెళ్లేది. ఈ క్రమంలో కొన్ని రోజులుగా కూలీకి వెళ్లకపోవడంతో ఎందుకు ఇంటివద్దే ఉంటున్నావని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది, ఆదివారం క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

- వేములవాడకు చెందిన యువకుడి మృతి

జగిత్యాల క్రైం: బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. జగిత్యాల పట్టణ ఎస్ఐ మన్మదరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన వావిలాల తిరుపతి(20) సోమవారం ఉదయం జగిత్యాలలోని తన స్నేహితులు వేల్పుల ప్రవీణ్, తోట రాములను కలిసేందుకు వచ్చాడు. అర్ధరాత్రి ప్రవీణ్ తన బైక్‌పై తిరుపతి, రాములను బయటకు తీసుకెళ్లాడు. జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ అవుట్ గేట్ వద్ద అతివేగం కారణంగా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దోపిడీ రహిత సమాజానికి కృషి



జెండా ఎగురవేసిన వెంకటస్వామి, నాయకులు

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు

కరీంనగర్: దోపిడీ రహిత సమాజం కోసం సీపీఐ కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో తమ పార్టీ అగ్రనాయకులు ప్రత్యక్షంగా పాల్గొని, జైలుపాలయ్యారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత సీపీఐ అనేక నిర్బంధాలను ఎదుర్కొందని, అనేక కార్మిక, ప్రజా ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందని అన్నారు. దేశ ప్రజలను కులాలు, మతాలవారీగా విభజించి పరిపాలిస్తున్న బీజేపీ, ఎన్డీఏకు వ్యతిరేకంగా సీపీఐ శ్రేణులు ప్రజోద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి కిన్నెర మల్లవ్వ, పైడిపెల్లి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, నలువాల సదానందం, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు


ధృవిక

చొప్పదండి: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శనలో చొప్పదండి మండలంలోని భూపాలపట్నంకు చెందిన కరుణకంటి ధృవిక పాల్గొంది. తన ప్రతిభతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది. ఆమె ప్రస్తుతం రెండోతరగతి చదువుతోంది. కూతురి ఘనతపై తల్లిదండ్రులు రాము– స్రవంతి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐటీయూసీకి టీబీజీకేఎస్ మద్దతు

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీకి తమ యూనియన్ ఆర్జీ–1 ఏరియాలో మద్దతు ప్రకటిస్తున్నట్లు టీబీజీకేఎస్ నాయకులు నూనె కొమురయ్య, గండ్ర దామోదర్‌రావు, వడ్డేపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవిషయాన్ని వెల్లడించారు. ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ విజ్ఞప్తి మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నాయకులు పర్లపెల్లి రవి, దూత శేషగిరి, కుషనపెల్లి శంకర్, ఎం.రాజేశం, మల్లారెడ్డి, చెల్పూరి సతీశ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, నేరెళ్ల సదయ్య, దొరగాండ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పందులను ఎత్తుకెళ్లిన ఆరుగురి అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్: పందులను ఎత్తుకెళ్లిన కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ విజేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల రోడ్డులో నివాసం ఉంటున్న రెవెల్లి ఎల్లయ్య పందులను పెంచుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. మొత్తం 22 జీవాలకు కామధేనువు రైస్‌మిల్లు పక్కన చెట్ల పొదల్లో పాక ఏర్పాటు చేశాడు. గత దసరాకు ముందు దాదాపు రూ.1.50 లక్షలు విలువైన పందులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రీనగర్, ఓదెల మండలంలోని మడక, ఎలిగేడు మండలంలోని వడ్కాపూర్‌కు చెందిన ఈరయ్య, శివాజీ, రాకేశ్, శివాజీ, సునీల్, రాజయ్యలను మంగళవారం అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


చుక్కారెడ్డి మృతదేహం

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలంలోని గొడిశెలపేటకు చెందిన వన్నెల చుక్కారెడ్డి(52) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చుక్కారెడ్డి ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి, మందులు వాడినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి మరోసారి కడుపునొప్పి రావడంతో భరించలేక క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కడుపునొప్పి వల్లే జీవితం విరక్తి చెంది, ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు.

వెంకటయ్య బావి నవల ఆవిష్కరణ



హైదరాబాద్: వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ అధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్ కుమార్ డబ్బీ కార్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.